అసంపూర్తిగా భవనాలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కోడేరు: గత ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి పక్కా భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ బడి భవనాల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత ప్రభుత్వం మండలంలోని మాచుపల్లి, రేకులపల్లి, తుర్కదిన్నె, కోడేరు ఎంపీపీఎస్ బాలుర, కోడేరు ఎంపీపీఎస్ బాలికలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజాపూర్ పీఎస్, జెడ్పీ ఉన్నత పాఠశాల, మైలారం ఎంపీపీఎస్, నర్సాయిపల్లి ఎంపీపీఎస్, కొండ్రావుపల్లి ఎంపీపీఎస్, జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. కోడేరు ఉన్నత పాఠశాలకు రూ.38 లక్షలు, ఎంపీపీఎస్ బాలుర పాఠశాలకు రూ.41లక్షలు, ఎంపీపీఎస్ బాలికల పాఠశాలకు రూ.23లక్షలు మంజూరు అయ్యాయి. అందుకు టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టారు. ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్, విద్యుత్, తాగునీటి వసతి, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా ఒక డైనింగ్ హాల్ మాత్రమే పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. పనులకు గత ప్రభుత్వం రూ. 24లక్షల బిల్లు చెల్లించారు. ప్రస్తుతం బిల్లులు రాక పనులు పెండింగ్‌లో పెట్టారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మన ఊరు, మన బడి కార్యక్రమాన్ని రద్దు చేసింది.


నిలిచిన ఎంపీపీఎస్ బాలుర పాఠశాల భవన నిర్మాణ పనులు

కొత్తగా 16 ఆదర్శ పాఠశాలలు

మండలంలో జనుంపల్లి ఎంపీయూపీఎస్, తీగలపల్లి ఎంపీయూపీఎస్, బావాయిపల్లి ఎంపీపీఎస్, పస్పుల ఎంపీయూపీఎస్, ఖానాపూర్ ఎంపీపీఎస్, కోడేరు ఎంపీపీఎస్, కోడేరు గుట్ట ఎంపీపీఎస్, వడ్డెర వాడ ఎంపీపీఎస్, నాగులపల్లి తండా ఎంపీపీఎస్, రాజాపూర్ ఎంపీపీఎస్, బాడిగదిన్నె ఎంపీపీఎస్, నర్సాయిపల్లి జడ్పీహెచ్‌ఎస్, ఎత్తం జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, కొండ్రావుపల్లి ఎంపీపీఎస్, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేసి ఒక్కొక్క పాఠశాలకు రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తైన బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా గతంలో చేసిన పనులను పూర్తి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇప్పటికైనా నిలిచిపోయిన పనులకు నిధులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నిలిచిపోయిన పనులను ప్రభుత్వం వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలి. గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.


– రామకృష్ణ, కోడేరు

అనుమతులు రాలేదు

మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తేనే పనులు ప్రారంభిస్తాం. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పనులు పూర్తైన వాటికి కొన్ని పాఠశాలలకు మాత్రమే బిల్లులు అందాయి.

– భాస్కర్‌శర్మ, ఎంఈఓ, కోడేరు

హార్టికల్చర్ కళాశాల ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్: హార్టికల్చర్ పాల్‌టెక్నిక్ కళాశాలను కొల్లాపూర్‌లో ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు ధార శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన ఆయన మాట్లాడారు.రెండేళ్ల కిందట కొల్లాపూర్‌కు హార్టికల్చర్ పాల్‌టెక్నిక్ కళాశాల మంజూరైందని, స్థానిక ఆర్‌ఐడీ పాఠశాలలో పాల్‌టెక్నిక్ తరగతులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు. వెంటనే కళాశాలను ఇక్కడి నుంచి వనపర్తి జిల్లాకు తరలించారన్నారు. స్థానిక మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకోవాలన్నారు. పట్టణంలోనే కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఇక్కడే కళాశాల తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు హెచ్చరించారు.

బిజినేపల్లిలో ఈదురుగాలులు, చిరు జల్లులు



బిజినేపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులతో కూడిన వాన కురిసింది. వరి సాగు చేసిన రైతులు, మొక్కజొన్న రైతులు, ఆయా పంటలు కోత కోసిన రైతులు కాస్త ఉపశమనం పొందారు. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా అక్కడక్కడ చెట్లు నేలకు ఒరిగాయి. వెల్గొండ గ్రామంలో వడ్లవాని కుంట వద్ద చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు



వెల్దండ: మండలంలోని అజిలాపూర్ ప్రధాన రహదారిపై చేతికందె ఎత్తులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా దర్శనిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మూడు రోజుల కిందట ఈదురుగాలులకు చెట్లు విరిగి పడి పడి వైర్లు కిందకు వేలాడుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ప్రయాణించేందుకు సమీప గ్రామస్తులు జంకుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పదించి వైర్లను సరి చేయాలని కోరుతున్నారు.

చెత్తాచెదారం తొలగింపు



తాడూరు: మండల కేంద్రంలోని 12 వార్డులలో మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు శుక్రవారం సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించారు. దీంతో అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టారు. మురికి కాల్వలో పేరుకున్న చెత్త చెదారాన్ని పంచాయతీ కార్మికులు తొలగించారు. జేసీబీ ద్వారా కంపచెట్లను తొలగించి శుభ్రం చేయించారు.

23న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కోడేరు: మండలంలోని ఒప్పితండాలో ఈనెల 23, 24, 25 తేదీల్లో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భాస్కర్‌నాయక్, రాజు, హన్మంతులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

నేడు వరికొనుగోలు కేంద్రం ప్రారంభం

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధరల పెంపుపై పునరాలోచించాలి

చారకొండ: కేంద్ర ప్రభుత్వం పెంచనున్న వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలపై పునరాలోచించాలని సీపీఐ కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధరలను పెంచితే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నారాయణ రెడ్డి, శ్రీను, బాలయ్య తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లి, నడింపల్లి, హాజీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ, భవన నిర్మాణ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఎన్నికైన వారిని వారు సన్మానించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

బార్ అసోసియేషన్ సెక్రటరీకి సన్మానం



తెలకపల్లి: హైకోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా మండల కేంద్రానికి చెందిన పస్పుల రాములు గెలుపొందారు. మొదటి సారిగా మండల కేంద్రానికి వచ్చిన రాములును శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు వరించాలని ఆకాంక్షించారు. సత్యనారాయణ, రమేష్, రాములు, జిలాని, బాలకృష్ణ, రవి, రాజు, కృష్ణ, వెంకటేష్, పరమేష్, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు



లింగాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ దమయంతి మాట్లాడుతూ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ నెల 22 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన ఉండాలన్నారు. సూపర్‌వైజర్ గిరిజ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

తాడూరు: ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఐతోలులో బస్టాండ్ దగ్గర ఆటో కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కనీసం ఆటో కిస్తీలు కట్టలేక ఫైనాన్స్ చెల్లించలేక ఆటోలు అమ్ముకుని రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు చెల్లించాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లయ్య, అజయ్, పరమేష్, గోపాల్ పాల్గొన్నారు.



రాష్ట్రంలో బలమైన శక్తిగా బీజేపీ

మన్ననూర్: రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని జిల్లా కార్యదర్శి శ్రీనునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పదర మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యల మల్లేష్ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన శ్రీనునాయక్ మాట్లాడారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలకు సిద్ధం కావాలన్నారు. బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు, సేవా కార్యక్రమాలు ఈ నెల 13 నుంచి 25 వరకు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ మండల అధ్యక్షుడు గోలి రాజు, నాయకులు పరమేశ్వర్, రవి, చంద్రయ్య, రాము యాదవ్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీను నాయక్

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


కార్యకర్తలతో శేఖర్‌రెడ్డి

వెల్దండ: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో క్రియాశీల సభ్యత్వ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టి పెట్టుకొని కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో సేవలందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అండగా ఉండి నిలదీయాలన్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నికపై అవగాహన కల్పించారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ కృష్ణగౌడు, మండల అధ్యక్షుడు కుర్మిమిద్ద యాదగిరి, నాయకులు ఉన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్: వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కోరారు. శుక్రవారం మండలంలోని జీడిపల్లిలో కార్యకర్తలతో కలిసి చలో వరంగల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 27న నిర్వహించే సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్, కృష్ణయ్య, భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న జైపాల్ యాదవ్

అజిలాపూర్‌లో వైద్య శిబిరం

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో శుక్రవారం కల్వకుర్తి వెంకటరమణ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 400 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. యశోద ఆస్పత్రి వైద్యులు గుండెకు సంబంధించిన పరీక్షలు, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు విరమళ్ల శరత్, రంజిత్, వెంకటస్వామి, మధులిక, సిరిచందన, నాగరాజు, తిరుపతయ్య, శ్యామ్, శ్రీనివాసులు, అరుణ్, మనీష్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ లక్ష్మమ్మ, మల్లయ్య, వెంకటేష్, మల్లేష్‌గౌడు తదితరులు ఉన్నారు.


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న వైద్యులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్

నాగర్‌కర్నూల్ రూరల్: ఉపాధి హామీ పథకం పనులలో పాల్గొన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బొందలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులను ఏడాదికి 200 రోజులు పని దినాలను కల్పించాలని దినసరి కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు జరిగే చోట ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేయాలని ఆలోచనలో భాగంగా నిధులను కేటాయించడం లేదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఉపాధి కూలీలు మణెమ్మ, బంగారమ్మ, ఇందిరమ్మ సాయి బాలమ్మ, చిన్నయ్య వెంకటయ్య బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఉట్లకోనేరు పురాతన ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి, శివాలయం అభివృద్ధికి పట్టణానికి చెందిన సాదె రాజు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.5 లక్షల విరాళం అందజేశారు. గతంలో గణేష్ మండప నిర్మాణం కోసం రూ. 2 లక్షలు, గతేడాది డిసెంబర్‌లో రూ. 5 లక్షలతో కలిపి మొత్తం రూ. 12 లక్షలు అందించాడు. అనాథ చిన్నారులకు సాయం అందజేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడు. అచ్చమ్మపేటగా అవతరించినప్పటి నుంచి ఉట్లకోనేరులోని దేవాలయాలు ఎంతో చరిత్ర ఉందని, పురాతన ఆలయాల అభివృద్ధికి తన వంతుగా సాయం చేస్తున్నానని దాత రాజు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఆలయాభివృద్ధికి పాటుపడుతానన్నారు. అనంతరం దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పెద్దకొత్తపల్లి: మారెడ్‌మాన్‌దిన్నే, వేడుక రావుపల్లి గ్రామాలలో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పెద్దవాగుకు వెళ్లే కాల్వలో ఉన్న జమ్మును ఉపాధి కూలీలు తొలగించారు. దీంతో వాగుకు నీరు చేరడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీముడునాయక్, లక్ష్మి, రాము, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు

లింగాల: మండల కేంద్రంలోని రామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 20న మండల కేంద్రంలో జిల్లా స్థాయి సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్: 94903 03377ను సంప్రదించాలని ఆయన కోరారు.

బాల్య మిత్రుడికి ఆర్థికసాయం

మన్ననూర్: గ్రామానికి చెందిన మంతటి చెన్నయ్య ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితుని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న 1993–94 బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు ఎం భాస్కర్, తిరుపతయ్య, అశోక్, శేఖర్, చెన్నయ్య, రఘుపతి, రాజేంద్రప్రసాద్, వెంకటనారాయణ, వెంకటేష్‌లు శుక్రవారం చెన్నయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. బాల్యమిత్రుడి ఆరోగ్య పరీక్షల కోసం తోటి స్నేహితులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే


నాగర్‌కర్నూల్‌లో భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు.

■ నాగర్‌కర్నూల్ ఎంబీ చర్చికి క్రైస్తవులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఎంబీ చర్చి చైర్మన్ సంపత్‌కుమార్, క్రైస్తవులు హాజరయ్యారు.

■ తిమ్మాజిపేటతో పాటు మండలంలోని గుమ్మకొండ, గొరిట, ఆవంచ, బుద్ధసముద్రం గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షతో కూడిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక షాలేము చర్చిలో పాస్టర్ శివ ప్రసాద్ ధార్మిక సందేశం ఇచ్చారు. అనంతరం చర్చిలో చిన్నారులు యేసుక్రీస్తు శిలువలో మరణించిన నాటక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేవదాసు, అధ్యక్షులు బాల్‌రాజ్, సభ్యులు సురేందర్, రవి, వెంకటస్వామి, సేవాగ్ తదితరులు పాల్గొన్నారు.

■ దోమలపెంట, ఈగలపెంట ప్రాంతాల్లోని చర్చిలలో ఉపవాసాలతో దీక్షల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్టియన్ సెంటర్ చర్చి పాస్టర్ రెవె.డా.ఆశీర్వాదం మాట్లాడుతూ పాపాలను రక్షించడం కోసం శిలువపై యేసుక్రీస్తు ప్రాణాలను అర్పించినట్లు తెలిపారు.

■ వెల్దండ మండల కేంద్రంతో పాటు గుండాల, బండోనిపల్లి, తదితర గ్రామాల్లో చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. గుండాలలోని ఎంబీ నజరేత్ చర్చిలో పాస్టర్ జోసఫ్ ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. జోసఫ్, మున్నా, శ్యామ్‌సన్, పీటర్, ప్రసాద్, యాదగిరి, రవికుమార్, సంధ్య, మీనా, బాలకిష్టమ్మా, రాణి తదితరులు ఉన్నారు.

■ కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల, ఎల్లూరు, జవాయిపల్లి, చింతలపల్లి, అమరగిరి గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

■ కల్వకుర్తి పట్టణంలో క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ చేపట్టిన 40 రోజుల ఉపవాస దీక్షలు ముగిసాయి. పాస్టర్ జేబీ రాజు మాట్లాడుతూ మానవాళి కోసం ఏసుప్రభు చేసిన కృషి త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో జోహార్న, స్టీవెన్ సన్, రామస్వామి, జగదీష్, ఇజ్రాయిల్, సురేష్ బాబు, రాజు, రవి, ఆనంద్, జ్యోతి, ప్రసాద్ పాల్గొన్నారు.

■ కల్వకుర్తి పట్టణంలోని ఎంబీ చర్చి నుంచి పట్టణ ప్రధాన చౌరస్తాల గుండా రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టుగా పాస్టర్ రాజు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంబీ చర్చి చైర్మన్ జోహార్న, వైస్ చైర్మన్ స్టీఫెన్‌సన్, సభ్యులు రవి, ప్రసాద్, ఆనంద్, రామస్వామి, జగదీష్, ఇజ్రాయిల్, సురేష్ బాబు, రాజు, ప్రేమ్, విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.


తిమ్మాజిపేట చర్చిలో చిన్నారుల నాటక ప్రదర్శన


కల్వకుర్తిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


వెల్దండ మండలం గుండాలలో..

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

అచ్చంపేట రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.